ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - సిద్దవటం

సిద్దవటం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను బుధవారం కడప ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆకస్మిక తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అట్లూరు, సిద్దవటం, ఒంటిమిట్ట ప్రాంతాల్లో నాటు సారా, లిక్కర్, మత్తు పదార్థాలు వంటి అసాంఘిక కార్యక్రమాలు గ్రామాల్లో చోటుచేసుకోకుండా నిఘా పెట్టాలని సూచించారు. అక్రమ మద్యం విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని జ్యోతి, దేగన వాండ్ల పల్లె తదితర పల్లె ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు మత్తు పదార్థాలపై అవగాహన సదస్సులు నిర్వహించి వారికి తెలియజేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సిఐ రాజశేఖర్ సిబ్బంది పాల్గొన్నారు.

కలుషిత నీరు తాగి 25 మందికి అస్వస్థత

ప్రజాశక్తి-జమ్మలమడుగు రూరల్

జమ్మలమడుగు పటణంలోని కన్నెలూరు, నేతాజీ నగర్‌లో కలుషిత నీరు తాగి 25 మంది అస్వస్థతకు గురయ్యారు. వివరాలు.. మంగళవారం రాత్రి ప్రజలు కలుషితమైన నీరు తాగడంతో పలువురికి బుధవారం ఉదయం నుంచి కళ్లు తిరగడం, వాంతులు, విరేచనాలు అయ్యాయి. అస్వస్థతకు గురైన వారి స్థానిక క్యాంబెల్, ప్రభుత్వ ఆసుపత్రి, ప్రయివేటు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. కొద్దిరోజులుగా తాగు నీరు మురికిగా, వాసనతో వస్తున్నట్లు ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

కలుషిత నీరు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

అయినప్పటికీ ఎలాంటి చర్యలు తీసు కోకపోవడంతో కలుషిత నీటిని తాగి అస్వస్థతకు గురయ్యారని స్థానికులు పేర్కొన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి, సిఐ, ఎస్ఐ, అధి కారులు పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. సంఘటనపై కమిషనర్ వెంకట రామిరెడ్డి స్పందిస్తూ ప్రజలు కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురవ్వగానే నేతాజీనగర్, కన్నెలూరుకు నీటి సరఫరా నిలిపేసి, ట్యాంకర్ల ద్వారా అంది స్తున్నామని చెప్పారు. నీటి సాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపి కారణాలు తెలుసుకుంటామని పేర్కొన్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదినా రాయణరెడ్డి ఫోన్ ద్వారా స్పందిస్తూ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులను ఆదేశించారు.

బాధితులకు మెరుగైన వైద్యం అందించాలి

పట్టణంలో కన్నెలూరు, నేతాజీ నగర్ కాలనీలలో కలుషిత నీరు తాగి అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వీరనాల శివ నారా యణ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ కుమార్ తెలిపారు. బుధవారం వారు జమ్మల మడుగులో విలేకరులతో మాట్లాడుతూ కొద్ది రోజులుగా నీరు దుర్వాసన వస్తోందన్నారు. అధికా రులు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

విషాదం నింపిన ఈత సరదా

నీట మునిగి ముగ్గురు చిన్నారులు మృతి
పెన్నా నదిలో ఒకరు... కెసి కాలువలో పడి ఇద్దరు..

ఈత సరదా రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. సెలవు రోజు కావ డంతో ముగ్గురు చిన్నారులు ఈత కోసం వెళ్లి నీట మునిగి మృత్యువాత పడ్డారు. ఈ సంఘటన జిల్లాలోని కెసి కెనాల్, పెన్నా నది ప్రాంతాల్లో చోటు చేసుకుంది. వివరాలు..

కెసి కాలువలో పడి ఇద్దరు..

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు) : మున్సిపాలిటీ పరిధిలోని కెసి కెనాల్‌లో ఇద్దరు పిల్లల మంగళవారం గల్లంతు అయ్యారు. రాత్రి ఒకరూ, బుధవారం ఒకరి మృతదేహాలు అభ్యమయ్యాయి. మైదుకూరు మున్సిపాలిటీ శాంతి నగర్‌కు చెందిన మద్దుం కుమారులు యాసిన్(10), రఫీ(9) మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయం నుంచి కనిపించలేదు. బంధువుల ఇంటికి వెళ్లి ఉంటారని తల్లిదండ్రులు వెతికారు. ఎక్కడ కనిపించకపోవడంతో అనుమానంతో కెసి కెనాల్ వెంబడి గాలింపు చేపట్టారు. కెసి కెనాల్ గట్టుపై పిల్లల బట్టలు ఉండడంతో కెనాల్ వెంబడి గాలింపు చేపట్టారు. బద్వేల్ రోడ్డులో కెనాల్ వద్ద యాసిన్(10) మృతదేహాన్ని కనుగొన్నారు. రఫీ కోసం గాలింపు చర్యలు చేపట్టిన రాత్రి కావడంతో గుర్తించలేకపోయారు. బుధవారం ఉదయం బద్వేల్ రోడ్డులో మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు అగ్నిమాపక సిబ్బంది మృతదేహాలను గాలింపు చేపట్టి వెలికి తీశారు. ఇద్దరు పిల్లలు మృతితో తల్లిదండ్రులు శోక సముద్రంలో మునిగిపోయారు. కాలనీలో విషాదఛాయలు అలుబుకున్నాయి.

పెన్నానదిలో లభ్యమైన ఇస్మాయిల్ మృతదేహం, కెసి కాల్వలో రఫీ మృతదేహం

పెన్నా నదిలో పడి మరో బాలుడు..

సిద్దవటం : సిద్దవటంలోని హైవే వంతెన ప్రాంతంలోని పెన్నా నదిలో బుధవారం అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన ఇస్మాయిల్ (6) బాలుడు ప్రమాదశాత్తు నీట మునిగి మృతి చెందాడు. తన బంధువులతో కలసి విహారయాత్రకు సిద్దవటంలోని పెన్నానదిలోకి వెళ్లాడు. సరదాగా నీటిలో ఆడుకుంటుండగా మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న ఒంటిమిట్ట సిఐ కృష్ణంరాజు నాయక్ సంఘటన స్థలానికి చేరుకుని గజ ఈతగాళ్ల సాయంతో బాలుడిని బయటికి తీసుకొచ్చారు. అప్పటికే అతను మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా
అసెంబ్లీలో తీర్మానం చేయాలి

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు డిమాండ్

గాంధీ విగ్రహం ఎదుట సిఐటియు, ఎఐటియుసి నిరసన దీక్షలు

దీక్షలు నిర్వహిస్తున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి ఓబులేసు డిమాండ్ చేశారు. బుధవారం విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ సమితి, కార్మిక, రైతు సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా కేంద్ర కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో నగరంలోని ఒకటో గాంధీ బొమ్మ ఎదుట సిఐటియు, ఎఐటియుసి నాయకులు నిరసన దీక్షలను చేపట్టారు. దీక్షలను ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రారంభించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, ఏపీ.రైతు సంఘాల జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా జి.ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్రానికి తలమానికంగా ఉన్న ఏకైక ప్రభుత్వ రంగ పరిశ్రమ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రయిటీకరించడాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీవ్రమైన ప్రయత్నాలు చేస్తున్నదన్నారు. ప్రయివేటీకరణ ఆపాలని 1315 రోజులుగా విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోనూ పోరాటంసాగిస్తున్నా, ప్రజాభిప్రాయాన్ని పెడచెవిన పెడుతూ మోడీ ప్రభుత్వం ఫ్యాక్టరీని దారదత్తం చెయ్యడానికి కంకణం కట్టుకుని 'పొమ్మనకుండా పొగపెట్టే' పనులు చేస్తుందని విమర్శించారు. ప్రయివేటీకరణ నిలుపుదల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ చొరవ తీసుకోవాలని కోరారు. ట్రేడ్ యూనియన్లతో కూడిన అఖిలపక్ష ప్రతినిధి వర్గాన్ని ప్రధాన మంత్రి దగ్గరికి రాయబారం తీసుకు వెళ్ళాలని చెప్పారు. కార్యక్రమంలో ఎఐటయుసి జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్, డిప్యూటీ సెక్రటరీ కె.సి.బాదుల్లా, ఎపి ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అనుబంధం రాష్ట్ర కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా నాయకులు బ్రహ్మానంద రెడ్డి, సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రారెడ్డి, వెంకటసుబ్బయ్య, మెడికల్ రేపు యూనియన్ నాయకులు రామాంజనేయులు రెడ్డి, సిపిఐ నగర కార్యదర్శి వెంకట శివ, కేంద్ర కార్మిక సంఘాల నాయకులు లింగన్న, రామాంజనేయులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, జిల్లాలో సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్ అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో బి మనోహర్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి మూడు దఫాలు అవుతున్నా విభజన హామీలు ఏమి అమలు చేయలేదన్నారు. ఆంధ్ర ప్రజల హక్కు అయినా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చేయకుండా చూస్తామని ప్రజలకు బహిరంగంగా చెప్పే పరిస్థితి కనిపించడం లేదన్నారు. రాయలసీమ ప్రజలకు తల మాణికమైన లక్షలాదిమంది కార్మికులకు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే కల్పవృక్షమైన కడప ఉక్కును ఏర్పాటు చేయడంలో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తుందని వారు అన్నారు. ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా వేలాదిమంది నిరుద్యోగులకు కార్మికులకు ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం సెయిల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ నిర్మించి అనేకమంది కార్మికులకు, నిరుద్యోగులకు ఉద్యోగ బాసటగా నిలవాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణం ఆపడం కోసం కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం పోరాటాలకు రాష్ట్ర ప్రజలు కడప జిల్లా నిరుద్యోగులు , కార్మికులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. సమావేశంలో సిఐటియు పట్టణం ప్రధాన కార్యదర్శి డి.విజయ్, నాయకులు ఏ.వినయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రయివేటీకరణ ఆపాలి

బద్వేలు : 32 మంది ప్రాణ బలిదానంతో ఏర్పాటు అయిన విశాఖ ఉక్కును ప్రయివేట్ పరం చేయాలని కేంద్రం చూస్తోందని విభజన హామీలలో ప్రధానమైన కడప ఉక్కు ను ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు పేర్కొన్నారు. సిఐటియు, డివైఎఫ్ఐ, కెవిపిఎస్, ఐద్వా మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పోరుమామిళ్ల రోడ్డులో ఉన్న గాంధీజీ విగ్రహం దగ్గర నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పైన, కడప ఉక్కు పైన తీవ్ర నిర్లక్ష్యం వహిస్తుందన్నారు విశాఖ ఉక్కు కోసం నేడు ప్రాణాలర్పించైనా ప్రయివేటీకరణ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాసులు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిని, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్, రూరల్ కార్యదర్శి బాల గురవయ్య, పట్టణ డివైఎఫ్ఐ మహిళా కో- కన్వీనర్లు ఎస్.కె.ఫాతిమా, చల్ల నాగలక్ష్మి, నాగమ్మ, దేవి, ఉపాధ్యక్షులు ఎస్.కె ఖలీల్ భాషా, మా పీరా డేవిడ్, సిఐటియు పట్టణ కో-కన్వీనర్ పిసి కొండయ్య, సుబ్బరాయుడు, సుబ్బయ్య, రామయ్య, రాజగోపాల్, వెంకటేష్, కెవిపిఎస్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు సగిలిరాయప్ప, ముడియం నరసింహులు, ఐద్వా మహిళా సంఘం నాయకురాలు మోక్షమ్మ ,అనంతమ్మ, కైరున్ బి, మస్తాన్ బి, బాలమ్మ, రామ లక్ష్మమ్మ, ఫాతిమా పాల్గొన్నారు.

ప్లకార్డుతో నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రాయశ్చిత్తంతో పరివర్తన చెందాలి

- కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - కడప : క్షణికావేశంలో నేరం చేసి శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు ప్రాయశ్చిత్తంతో పరివర్తన చెందాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అన్నారు. బుధవారం మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా జైళ్లశాఖ ఆధ్వర్యంలో స్థానిక పురుషుల కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాల్లో నిర్వహించిన ఖైదీల సంక్షేమ దినోత్సవ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథులుగా, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా కారా గారాలలో నిర్వహించిన కార్యక్రమాల్లో కలెక్టర్ మాట్లాడుతూ నేరస్తులను అసహ్యించుకోరాదని పేర్కొన్నారు. గతమంతా మర్చిపోయి ఇక్కడ నుంచి విడుదలయ్యాక ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్దిని అందుకుని హుందాగా జీవిస్తూ సమాజంలో గౌరవ ప్రతిష్టలను పొందాలన్నారు. ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ క్షణికావేశంలో అనుకోని సంఘటనలు చేయడం ద్వారా ఖైదీలుగా ఇక్కడకు వచ్చారని, ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను ఉపయోగించుకుని విడుదల అయ్యాక స్వయం ఉపాధి ఏర్పాటు చేసుకోవాలన్నారు. మహిళా, పురుషుల ఖైదీలకు వేరువేరుగా నిర్వహించిన వాలీ బాల్, చెస్, పాటలు, క్యారమ్స్, వ్యాస రచన లాంటి వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులను కలెక్టర్, జడ్జి అందజేశారు. మహిళా కారాగారంలోనిఖైదీలకు వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు.

అక్రమ మైనింగ్ వల్లే విఆర్ఎ హత్య : ఎంపీ

ప్రజాశక్తి-పులివెందులటౌన్ : అక్రమ మైనింగ్ వల్లే విఆర్ఎ నరసింహులు హత్య జరిగిందని, ఇష్టం వచ్చినట్టు కూటమి నాయకులు తమ పార్టీ వారిపై దాడి చేస్తున్నారని, పో లీసు వ్యవస్థ పూర్తిగా కంట్రోల్ తప్పిందని కడప పార్లమెంటు సభ్యుడు వై.ఎస్. అవినాష్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు పూర్తిగా అదుపు తప్పాయిని, మట్కా, జూదం, ఇసుక అక్రమ రవాణా, అక్రమ మైనింగ్ విపరీతంగా పెరిగిందని ఆయన పేర్కొన్నారు. అక్రమ మైనింగ్ పై ఎస్పి, ఇతర అధికారులందరికీ అనేకసార్లు విన్నవించామని అయి నా కట్టడి చేయకపోవడం వల్లే విఆర్ఎ నరసింహులు హత్య జరిగిందని అన్నారు. డిటోనేటర్‌లను సరఫరా చేసే వారిని, వాడిన వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి నరసింహులు కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి సంక్షేమం తప్ప ఏనాడు ఇలాంటివి కనిపించలేదన్నారు. పులివెందుల మెడికల్ కళాశాలకు మెడికల్ సీట్లు వద్దంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాసిందని, పులివెందుల ప్రాంతంలో పూర్తి అయిన కోల్డ్ స్టోరేజ్, క్రీడా ప్రాం గణాలను ఆచరణలోనికి తేవాలన్నారు. రాజకీయ లబ్ధి కోసమే తిరుపతి లడ్డుపై రాద్ధాంతాలు చేస్తున్నారని, సుప్రీంకోర్టు కూడా తప్పు పట్టిందని చెప్పారు.

విఆర్ఎను చంపిన బాబును తక్షణమే అరెస్టు చేయాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : పులివెందుల నియోజకవర్గం, వేముల మండలం కొత్తపల్లిలో పనిచేస్తున్న విఆర్ఎ నరసింహులుపై జిలిటన్‌స్టిక్స్ విసిరి చంపిన సి.బాబును తక్షణమే అరెస్ట్ చేయాలని విఆర్ఎ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటపతి, నాగేంద్రాలు ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న దారుణంగా చంపడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. మంచం మీద పడుకున్న నరసింహలుపై జిలిటిన్ స్టిక్స్ విసిరి వేశారన్నారు. మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని తెలిపారు. సి.బాబును అరెస్ట్ చేసి కోర్టుకు పెట్టకపోతే జిల్లా వ్యాపితంగా ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

కొత్త మోటర్లను ఎందుకు ఏర్పాటు చేయరు?

ప్రజాశక్తి - కడప అర్బన్ : నగర ప్రజలు మంచినీటి సమస్యతో అల్లాడుతూ ఉంటే కార్పొరేషన్ అధికారులు ఎందుకు కొత్త మోటర్లను పెట్టడం లేదని ఎమ్మెల్యే మాధవి ప్రశ్నించారు. బుధవారం గండి వాటర్ వర్క్స్‌లో మంచినీటి సరఫరా మూటల పనితీరును పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్ నందన్, ఇంజినీరింగ్ అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటాడుతూ శాశ్వత మంచినీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేందుకే పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఉపాధ్యాయులలో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు క్రీడ, సాంస్కృతిక పోటీలు ఎంతగానో తోడ్పడతాయని ప్రముఖ వైద్యులు డాక్టర్.ఎస్.ఓబుల్ రెడ్డి పేర్కొన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా కడప నగరంలోని అంధుల పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో విభిన్న ప్రతిభావంతులకు నిర్వహిస్తున్న క్రీడ, సాంస్కృతిక పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యుటిఎఫ్ స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకుని విభిన్న ప్రతిభావంతులైన ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ పోటీల ద్వారా ఉపాధ్యాయులలో అంతర్గతంగా దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడంతోపాటు, వారిలో మానసిక ఆహ్లాదాన్ని కలిగించవచ్చన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ యుటిఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తైన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయులకు క్రీడా, సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎబినేజర్, యుటిఎఫ్ జిల్లా జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాస్ అహ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు డి.రూతు ఆరోగ్య మేరీ, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, అంధ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు పి.పార్థసారథి, స్టాఫ్ సెక్రటరీ ఎ.రాజా, అంధ ఉపాధ్యాయుల సంఘం నాయకులు ఎస్.లక్ష్మణరావు, వి.సుబ్బరాయుడు, కె.సుబ్బరాయుడు, భాస్కర్ రెడ్డి, బాలయ్య, ఎ.నాగరత్నమ్మ పాల్గొన్నారు.

మద్యనిషేధంపై నిర్ణయం తీసుకోవాలి

ప్రజాశక్తి - బద్వేలు : మద్యపానాన్ని నిషేధించాలని, అప్పుడే మహిళలకు రక్షణగా ఉంటుందని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా తయారవుతుందని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా పట్టణ నాయకురాలు మోక్షమ్మ, కైరున్‌బీ డిమాండ్ చేశారు. బుధవారం ఐద్వా మహిళా సంఘం బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం గాంధీజీ విగ్రహం దగ్గర నిరసన తెలియజేసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మద్యపానం నిషేధం నిషేదిస్తామని చెప్పినటువంటి వాగ్దానం అమలు చేయకుండా జనాభా ప్రాతిపదికన వైన్ షాపులు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేస్తూ ఇచ్చినటువంటి జీవోలను వెనక్కి తీసుకోవాలని పేర్కొన్నారు. తాగడం వల్ల దాడులు, అత్యాచారాలు పెచ్చురేగుతున్నాయని మహిళలకు రక్షణ కల్పించాలంటే మద్యాన్ని ఎత్తివేయాలని వారు తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు బాలమ్మ, మస్తాన్ బి, రామలక్ష్మమ్మ, దేవి, ఫాతిమా, నాగలక్ష్మి, నాగమ్మ, ఫాతిమా పాల్గొన్నారు.

26న సైనిక రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ప్రజాశక్తి కడప అర్బన్ : సైనిక రిక్రూట్‌మెంట్ ర్యాలీని ఈనెల 26న కడపలో నిర్వహించనున్నట్లు కల్నల్ కుల్‌దీప్ సింగ్ పేర్కొన్నారు. ఆయన విలేకర్లతో కడప కలెక్టరేట్ సమీపంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న మాజీ సైనికులకు, వారి కుటుంబంలోని వితంతువులకు, విభిన్న ప్రతిభావంతులకు ఆర్థిక సాయంతో పాటు మోటర్ ట్రై సైకిల్, హియరింగ్ మిషన్లు వంటివి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమానికి కొన్ని ఉచిత బస్సులు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తానని ఈ సందర్భంగా కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. కడప జిల్లాలోని యువత, నిరుద్యోగులు ఈ సైనిక రిక్రూట్మెంట్ ర్యాలీలో భాగస్వాములై దేశ రక్షణకు, సమా జ శ్రేయస్సు పాటు పడాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జిల్లా సైనిక సంఘం తప్పక అందరిని సమాయత్త పరుస్తుందని మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు లక్ష్మీనారాయణ చెప్పారు.

నగరాన్ని శుభ్రంగా ఉంచుదాం

ప్రజాశక్తి - కడప : కడప నగరాన్ని శుభ్రంగా ఉంచుకునే బాధ్యత మనందరిపై ఉందని కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ కె.మురళీమోహన్ అన్నారు. ప్రభుత్వ రంగ బ్యాంక్ అయినటువంటి కెనరా బ్యాంక్ రీజనల్ హెడ్ కే. మురళీమోహన్ ఆధ్వర్యంలో బుధవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని కడప నగరంలో పరిశుభ్రతను పెంపొందించేందుకు 'స్వచ్ఛత హీ సేవా'ను నిర్వహించారు. నగరంలోని ఐటిఐ సర్కిల్ వద్ద గల భగత్ సింగ్ పార్క్ ఆవరణాన్ని కెనరా బ్యాంకు సిబ్బంది పరిశుభ్రం చేశారు.

నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్లాజాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవి

మహాత్మా గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడవాలని, కడప నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కడప శాసన సభ్యురాలు ఆర్. మాధవి, డిఆర్ఒ గంగాధర్ గౌడ్, నగరపాలక సంస్థ కమిషనర్ వై.ఒ. నందన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎర్రముక్కపల్లి సర్కిల్ సమీపంలోని గాంధీనగర్ పాఠశాల వద్ద నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ 155 వ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గాంధీ ప్లాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని, ఆయనను మనమందరం మననం చేసుకోవాలని అన్నారు. మహనీయుల ఆశయ సాధనకు ఉద్యోగులు కృషి చేయాలని, పేదవారికి న్యాయం చేయాలన్నారు. కాలుష్య నివారణలో భాగంగా ఏర్పాటుచేసిన పొల్యూషన్ కంట్రోల్ ఫౌంటెన్‌లను గాంధీ ప్లాజాలో ఏర్పాటు చేశామని చెప్పారు. గాంధీ ప్లాజా నగర పాలక సంస్థ రూ.90 లక్షల అంచనా వ్యయంతో ఎన్‌సిఎ పి విధులతో నిర్మించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు 19వ డివిజన్ మాజీ కార్పొరేటర్ వెలిగండ్ల లక్ష్మయ్య, జిల్లా అధికారులు, సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించనప్పుడు సమావేశాలెందుకు?

ప్రజాశక్తి-చెన్నూరు : సమస్యలు పరిష్కరించనప్పుడు సమావేశాలేందుకని ప్రజలు, రైతులు అధికారుల తీరుపై మండిపడ్డారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకుని పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ సిద్ది గారి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ప్రజలు రైతులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చెన్నూరు కొత్త రోడ్డు వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపులను, అలాగే ఇళ్లను తొలగించారని, తరువాత వారికి పరిహారం అందించిన పాపాన పోలేదని ప్రజలు మండిపడ్డారు. కనీసం అక్కడ సర్వీస్ రోడ్లు కానీ, డ్రెయినేజీ పనులు కానీ, అసలు బస్సు షెల్టర్ కానీ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయాలపై కార్యదర్శి రామ సుబ్బారెడ్డి మాట్లాడుతూ చెన్నూరు కొత్త రోడ్డు వద్ద బస్ షెల్టర్లు నిర్మించేందుకు పంచాయతీ తరపున సిద్ధంగా ఉన్నామని, నేషనల్ హైవే అధికారులు తామే పనులు చేపడతామని చెప్పారని సమాధానమిచ్చారు. ఒకటి, రెండు రోజులలో స్థానిక పోలీస్ స్టేషన్లో సమాచారం ఇచ్చి పందుల యజమానులపై చర్యలు తీసుకొని వాటిని గ్రామాలకు దూరంగా ఉండే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. సమావేశంలో కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కల్లూరు విజయ భాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ భాస్కర్‌రెడ్డి,ప్రజలు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవిజయదుర్గాదేవి దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి- కడప అర్బన్ : శ్రీ విజయదుర్గాదేవి దసరా ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావు, ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ తెలిపారు. బుధవారం ఉత్సవాల బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి విశేషంగా తెల్లవారుజామున 9 పవిత్ర నదీజలాలను నింపిన విశేష కళాశాలతో నవ కలశస్నపనం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం యగశాలలో శ్రీ విజయదుర్గ చండీహోమాలు వేదపండితులు రాయపద్ది. సుబ్బరామశర్మ ఆధ్వర్యంలో ప్రారంభం కానున్నాయని తెలిపారు. శ్రీచక్రమండపంలో నవావరణ శ్రీచక్రార్చనలు వుంటాయని చెప్పారు. మొదటి రోజున అమ్మవారు 'శైలపుత్రి' దేవిగా దర్శనం ఇవ్వనున్నారని పేర్కొన్నారు.

ఇద్దరు మోసగాళ్ల అరెస్టు

- రూ.2 కోట్ల విలువైన 37 కార్లు స్వాధీనం

- ఎస్పి హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

తమకు జిల్లా స్థాయిలో ప్రభుత్వ అధికారులు పరిచయమని, నెలకు రూ. 30 వేలు కారుకు అద్దె చెల్లిస్తానంటూ కొద్ది నెలలు అద్దె చెల్లించి, కార్లు తిరిగి ఇవ్వకుండా, కార్లకు అద్దె చెల్లించకుండా ఉంటూ మోసం చేసిన నబీకోటకు చెందిన నిమ్మకాయల వెంకట శశిధర్ రెడ్డి (38),షేక్. జిలాని (21) ని నబికోట శివాలయం వద్ద అరెస్టు చేసి రూ. 2 కోట్ల విలువైన వివిధ కంపెనీల కార్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. బుధవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన మూడు కార్లు అద్దెకు తీసుకుని మొదటి రెండు నెలలు అద్దె చెల్లించి తరువాత అద్దె చెల్లించకుండా, కార్లు ఇవ్వకుండా మోసం చేశారేని సెప్టెంబర్ 25న కడప తాలూకా పిఎస్‌లో కడప నగరం నబీకోట కు చెందిన బాధితుడు దిన్నె వీరేందర్ ఫిర్యాదు చేశారని తెలిపారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. అద్దె పేరిట మరో 34 కార్లను తీసుకుని యజమానులను మోసం చేసి కుదువ పెట్టినట్లు విచారణలో పోలీసులు గుర్తించారని పేర్కొన్నారు. వివిధ వ్యక్తుల వద్ద రూ.47 లక్షలకు కుదువ పెట్టిన మొత్తం రూ. 2 కోట్ల విలువైన 37 కార్లను తాలూకా పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అతి తక్కువ సమయంలో కేసు ఛేదించి నిందితులను అరెస్టు చేయడంతో పాటు కార్లను రికవరీ చేసిన సిఐ జి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ డి.తాహిర్ హుస్సేన్, సిబ్బంది హెడ్ కానిస్టేబుళ్లు శేఖర్, విద్యాసాగర్, కానిస్టేబుళ్లు రమేష్, సునీల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

అణగారిన వర్గాలు ఎర్రజెండా పట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - బద్వేలు : స్థానిక భూ పోరాట కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ బద్వేలు రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ' జాతిపిత మహాత్మా గాంధీ 155వ జయంతి సభ' కార్యదర్శి దాసరి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ 1925-30 ప్రాంతంలో మోహన్ కరంచంద్ గాంధీ అనేక రచనలు రాశారని వాటిని చదివి ప్రజాసేవకు, దేశ సేవకు, అస్పృశ్యత నివారణకు, హిందూ-ముస్లిముల ఐక్యత కోసం, స్వదేశీ ఉద్యమంలో సత్యాగ్రహం ఆయుధంగా, మధ్య నిషేధం కోసం, కృషిచేసిన ఎంతోమంది దేశభక్తుల్లో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య కూడా ఉన్నారన్నారు. మతోన్మాదాన్ని తుది శ్వాస విడిచే వరకు ఎదిరించిన మహాత్ములు గాంధీ అన్నారు. సామ్రాజ్య వ్యతిరేక పోరాటంలో కీలకపాత్ర వహించిన వ్యక్తి గాంధీ అని కొనియాడారు. అణగారిన వర్గాలు, కుల నిర్మూలన పై పోరాటం ఎర్రజెండా పట్టుకొని చేయాల్సిన చారిత్రక అవసరం దేశంలో ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పఠాన్ చాన్ బాషా, వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ రమణ, మహిళా సంఘం నాయకులు దుర్గమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

మండల స్థాయి చెకుముకి పరీక్ష

ప్రజాశక్తి-కడప అర్బన్ : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం చెకుముకి మండల స్థాయి పరీక్ష బాలాజీ నగర్‌లోని యుటిఎఫ్ భవన్ లో నిర్వహించారు. కడప నగరంలోని దాదాపు 50 పాఠశాలల నుంచి 5000 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పోటీలలో విజేతలుగా గాంధీ నగర్ మున్సిపల్ హై స్కూల్, ద్వితీయ స్థాయిలో మున్సిపల్ మెయిన్ స్కూల్, జెడ్‌పిహెచ్ఎస్ చెమ్మమియాపేట తృతీయ స్థానంలో ఏపీ ఉర్దూ రెసిడెన్షియల్ స్కూల్ రామాంజనేయ పురం విద్యార్థులు నిలిచారు. ప్రయివేట్ స్కూల్ విజేతలుగా ప్రథమ స్థానంలో నాగార్జున మోడల్ స్కూల్, ద్వితీయ స్థానంలో నాగార్జున మోడల్ మరొక జట్టు, తృతీయ స్థానంలో నిర్మల ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ పాఠశాలలు విజేతలుగా నిలిచాయి. ఈనెల 27న జరగబోయే జిల్లా స్థాయికిపై ప్రథమ స్థాయిలో వచ్చిన పాఠశాలలు పోటీలో అర్హత సాధించాయని జన విజ్ఞాన వేదిక తెలియజేస్తోంది. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి బి.రాజశేఖర్ రాహుల్, ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాల, ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి టీములకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జెవివి కార్యకర్తలు కిరణ్, గోవిందు, అరుణ, కామేశ్వరమ్మ, నరసింహ, సునీత, విద్యార్థిని, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సహకరించిన పాఠశాల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు కడప సిటీ కమిటీ ధన్యవాదాలు తెలిపారు.

గెజిట్ రేట్లను చూపిస్తున్న జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

ఎగ్జిబిషన్‌లో గెజిట్ ప్రకారమే రేట్లను పెట్టాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

దసరా సందర్భంగా ప్రొద్దుటూరులో ఏర్పాటు చేయనున్న ఎగ్జిబిషన్‌లో గెజిట్ ప్రకారమే రేట్లు పెట్టాలని టిడిపి నాయకులు డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి నిర్వాహకులను సూచించారు. స్థానిక టిబి రోడ్డులోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అనుచరులు ఎగ్జిబిషన్‌లో చేసిన అరాచకాలను గుర్తు చేశారు. రాచమల్లు అనుచరులు వారి హయాంలో ఎగ్జిబిషన్ వేలంపాటలో పాల్గొని మున్సిపాలిటీ ఆదాయానికి రూ.45 లక్షలు గండి కొట్టారని తెలిపారు. ఈ మున్సిపాలిటీ సొమ్మును ఆర్‌ఆర్ యాక్ట్ ప్రకారం వసూలు చేయాలన్నారు. రాచమల్లు ఓటమి నుంచి ఇంకా తేరుకోలేదని, ప్రభుత్వం వచ్చి మూడు నెలల కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రభుత్వ మీద లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. టిడిపి అధినాయకులు, మంత్రుల మీద మాట్లాడేటప్పుడు రాచమల్లు జాగ్రత్తగా మాట్లాడాలన్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు రాకుండా అధికారులు మున్సిపాలిటీ గెజిట్‌లో పాడిన రేట్లు ప్రకారం ఎగ్జిబిషన్ బయట, లోపల రేట్లు వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు దస్తగిరి, పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీచౌడేశ్వరీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

ప్రజాశక్తి - కడప సిటీ

కడప నగరం ఎర్రముక్కపల్లెలో వెలసిన శ్రీ చౌడేశ్వరీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నేటి నుండి 12వ తేదీ వరకు శాస్త్రీయంగా వైభవోపేతంగా కన్నులపండువగా నిర్వహించనున్నట్లు శ్రీ చౌడేశ్వరీ దేవస్థానం ఆలయ కమిటీ అధ్యక్షులు కళ్యా సుధాకర్ తెలిపారు. శ్రీ చాంద్రమాన క్రోధి నామ సంవత్సర ఆశ్వియుజ శుద్ధ పాడ్యమి నేటి నుంచి 12వ తేదీ శనివారం వరకు శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. శ్రీచౌడేశ్వరీదేవి భక్తుల కొంగు బంగారంగా, ఆరాధ్యదైవంగా శోభిల్లుతూ పూజలు అందుకున్నారన్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం 5 గంటల నుండి 6 గంటల వరకు అమ్మవారికి సుగంధద్రవ్యాలతో పంచామృతాభిషేకం, అనంతరం 6 నుండి 7 వరకు సహస్ర కుంకుమార్చన, మహామంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం ఉంటాయన్నారు. ప్రతిరోజూ సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, సహస్రకుంకుమార్చన జరుగుతుందన్నారు. ఆలయ అర్చకులు పెట్టిపోత ప్రవీణ్‌కుమార్‌శర్మ, సతీష్‌కుమార్‌శర్మల నేతృత్వంలో శరన్నవరాత్రుల్లో అమ్మవారికి అలంకరణ జరుగుతుందన్నారు. 3న గురువారం శుద్ధ పాడ్యమి రోజున శ్రీచౌడేశ్వరీదేవి అలంకారం, 4 శుక్రవారం శుద్ధ విదియ శ్రీ లలితాదేవి అలంకారం, 5 శనివారం శుద్ధ తదియన శ్రీ గజలక్ష్మీదేవి అలంకారం, 6 ఆదివారం శుద్ధ చవితిన శ్రీ అన్నపూర్ణాదేవి అలంకారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, 7 సోమవారం శుద్ధ చవితిన శ్రీ మోహినీదేవి అలంకారం, 8 మంగళవారం శుద్ధ పంచమిన శ్రీగాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిస్తారన్నారు. 9 బుధవారం శుద్ధ షష్టిన శ్రీ సరస్వతి దేవి అలంకారం, 10 గురువారం శుద్ధ సప్తమిన శ్రీ మహిషాసురమర్దినిదేవి అలంకారం, 11 శుక్రవారం శుద్ధ అష్టమిన శ్రీరాజరాజేశ్వరీదేవి అలంకారం, 12న శనివారం మధ్యాహ్నం 3 గంటలకు శమీవృక్ష దర్శనం, శ్రీ విజయలక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. అనంతరం రాత్రికి అమ్మవారి గ్రామోత్సవం కన్నులపండుగగా జరుగును. ఈ ఉత్సవాల్లో నగర ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

బ్రహ్మంగారిమఠం : మండలంలోని జగన్మాత శ్రీ ఈశ్వరిదేవి మఠంలో శ్రీశ్రీశ్రీ వీరశివకుమార్ స్వాముల వారి సమక్షంలో, కార్యనిర్వహణ అధికారి జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహో త్సవాలు గురువారం నుంచి ప్రారం భం కానున్నాయి. ఉత్సవాలు ఈనెల 13వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు 'శ్రీచైతన్య' విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ చైతన్యరెడ్డి తెలిపారు. ఆ విద్యార్థులను బుధవారం చైతన్యరెడ్డి అభినందించారు. కడప నగరంలోని జయనగర్ కాలనీ బాలికోన్నత పాఠశాలలో కడప బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారన్నారు. అండర్-14 విభాగంలో 8మంది విద్యార్థులు ఎంపికయ్యారని వివరించారు.

చిత్ర లేఖనంలో స్వామి వివేకానంద విద్యార్థి ప్రతిభ

వేంపల్లె : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థి జస్వంత్‌రెడ్డి జిల్లా మొదటి స్థానంలో రాణించినట్లు కరస్పాండెంట్ రామాంజనేయరెడ్డి తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలో నేషనల్ సైంటిఫిక్ టెంపర్ డే సందర్భంగా జెవివి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలు నిర్వహించారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ప్రభాకర్ ను, విద్యార్థి జస్వంత్ రెడ్డిని ఆయన అభినందించారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ప్రసాద్‌రెడ్డి, సత్యానందం

జమ్మలమడుగు రూరల్ : అపుస్మా ఆధ్వర్యంలో ప్రయివేట్ పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుల బోధన పద్ధతులను దృష్టిలో పెట్టుకొని ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించి మేమెంటోలను అందజేశారు. ఇందులో జమ్మలమడుగు బాలాజీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయులు కెవివి ప్రసాద్‌రెడ్డి, ఆర్ సత్యానందం ఎంపికయ్యారు. కడప జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో వారు టీచర్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మెమొంటో అందుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమను గుర్తించి ఈ అవార్డు వచ్చేలా కృషి చేసిన బాలాజీ హైస్కూల్ కరెస్పాండెంట్ బైరెడ్డి నిఖిలారెడ్డి, బాలాజీ విద్యాసంస్థల డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

10 మోటర్ సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు పట్టణంలో మోటర్ సైకిళ్ల దొంగతనాలు చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి దాదాపు రూ.7 లక్షలు విలువ చేసే 10 మోటర్ సైకిళ్లను ప్రొద్దుటూరు-2 టౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు బుధవారం డిఎస్‌పి భక్తవత్సలం పర్యవేక్షణలో టూ టౌన్ సిఐ యుగంధర్, ఎస్ఐలు ధనుంజయుడు, రాఘవేంద్రరెడ్డి మడురు రోడ్డులోని ప్రకాష్‌నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో.. సోమిరెడ్డిపల్లి లాజరయ్య అలియాస్ ఓబులేసును అరెస్ట్ చేశామన్నారు. అతని వద్ద నుంచి తొమ్మిది హోండా కంపనీకి చెందిన షైన్ మోటర్ సైకిళ్లు, ఒక డ్రీమ్ నియో మోగర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలని దురుద్దేశంతో పొద్దుటూరు టౌన్ రద్దీ ప్రాంతాల్లో పార్కు చేసిన మోటర్ సైకిళ్లను నకిలీ తాళంతో లాక్ తీసి, వాటిని దొంగలించేవాడు. వాటిని బ్రహ్మంగారిమఠంలోని ఓబులేస్ తన ఇంటికి దగ్గరలో ఉన్న కంపచెట్లలో దాచేవాడు. వాటిపైన ప్లాస్టిక్ పట్టను కప్పాడని పోలీసులు తెలిపారు. పట్టుకున్న వారిలో సిబ్బంది ఎం.రవీంద్ర నాయక్, బి.రామంజులు ఉన్నారు.

పట్టుకున్న మోటర్ సైకిళ్లతో పోలీసులు

విశ్వ మానవుడు.. గాంధీ మహాత్ముడు

పులివెందుల : గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - కడప అర్బన్/కడప

మహాత్మా గాంధీ ఆశయాలు స్ఫూర్తిగా తీసుకుందామని ఎస్‌పి హర్షవర్ధన్ రాజు పిలుపునిచ్చారు. జాతిపిత మహాత్మా గాంధీ 155వ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జాతిపిత చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ డిఎస్‌పి మురళీధర్, ఆర్ఐలు వీరేష్, టైటస్, శ్రీశైల రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. **కడప ఎమ్మెల్యే నివాళి..** కడప ఎమ్మెల్యే మాధవి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి మహాత్మా గాంధీ చేసిన సేవలను, స్వాతంత్ర్యం తీసుకు వచ్చిన తీరును తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..** కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులు ఎన్. డి. విజయ జ్యోతి,నగర అధ్యక్షులు అఫ్జల్ ఖాన్ ఒకటో గాంధీ బొమ్మ వద్ద పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీకి ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సుశీల్ కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి జకరయ్య, ప్రముఖ సంఘ సేవకులు సలావుద్దీన్, మాజీ పిసిసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకటరమణారెడ్డి, మాజీ ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లెం విజయభాస్కర్, కదిరి ప్రసాద్ గౌడ్, హరి ప్రసాద్, మామిళ్ళ బాబు, మామిల్ల నరసింహులు, కుళ్లాయప్ప, గౌరీదేవి, పిడి సంజయ్ కాంత, చెప్పలి పుల్లయ్య అమిత్ తారీఖ్, కమల్ భాష, జోహార్, బాబ్జి, సుజాత రెడ్డి, సుబ్బారెడ్డి, సిరాజుద్దీన్, సురేష్ అలెక్స్, సంతోషమ్మ, గంగయ్య, మైనుద్దీన్, అబిద్, సత్యనారాయణ పాల్గొన్నారు. స్థానిక మహిళ పోలీస్ స్టేషన్ వద్ద, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిప్యూటీ మాజీ సిఎం అంజాద్‌బాషా జాతిపిత మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు. **ప్రభుత్వ పురుషుల కళాశాలలో..** ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమేష్, ఏవో రమణమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని గాంధీకి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్పివోలు డాక్టర్ అంకాల నాగరాజు, డాక్టర్ లీలా వర్ధిని, శివరామకృష్ణ, వాలంటీర్లు పాల్గొన్నారు. **వైవీయూలో..** మహాత్మా గాంధీకి ఘన నివాళులర్పించారు. వైవీయూ ప్రాంగణంలోని స్వచ్ఛభారత్ వేదికపై మహా త్ముడి చిత్రపటానికి విసి ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ వెంక ట్రామిరెడ్డి, విద్యార్థులు, ఎస్ఎస్ఎస్. పీవోలు , వాలంటీర్లు పూల మాలలు వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్.రాజగోపాల్ రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు. **కందుల విద్యా సంస్థలో..** జాతిపిత మహాత్మా గాంధీ 155 వ జయంతి సందర్భంగా నగరంలోని ఐటిఐ సర్కిల్ వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కెఎస్ఆర్ఎం ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సురేష్ బాబు, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ కె.రామోహన్ రెడ్డి, కల్చరల్ క్లబ్ ఇంచార్జీ వీర శంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **కలసపాడు :** భారత స్వతంత్ర సమర పోరాటంలో ప్రముఖ పాత్ర వహించిన వారిలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి చిరస్మరణీయులు. వీరిలో ముఖ్యంగా మహాత్మా గాంధీ అలుపెరుగని పోరాటం చేసి భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చారని యుటిఎఫ్ మండల అధ్యక్షుడు జి బాల ఓబయ్య తెలిపారు. మొదటగా ఉపాధ్యాయులందరూ మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కె చెన్నయ్య మండల ప్రధాన కార్యదర్శి డి ఈశ్వరయ్య జిల్లా కౌన్సిలర్లు గురయ్య పాల్గొన్నారు. **కమలాపురం టౌన్ :** టిడిపి కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి మండల అధ్యక్షులు సిరిగిరెడ్డి రాఘవరెడ్డి నివాళులర్పించారు. మున్సిపల్ కమిషనర్ పగడాల జనార్ధన్ పాల్గొని గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమం నగర పంచాయతీ సిబ్బంది. కౌన్సిలర్లు , సచివాలయ సిబ్బంది. పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. **బద్వేలు :** పట్టణంలోని మైదుకూరు రోడ్డు , అమ్మవారి శాల వీధి ఎదురుగా ఉన్న మహాత్మా గాంధీ విగ్రహాలకు ప్రజా సంఘాలైన ఆర్యవైశ్య వర్తక సంఘం, అమ్మవారి శాల పాలకమండలి సంఘం, అమ్మవారి శాల వీధి కోదండ రామస్వామి దేవాలయ కమిటీ, వీరభద్ర స్వామి దేవాలయ కమిటీ,మహనీయుల ఆశయాల సాధన కమిటీ, ఆవాజ్ కమిటీ, బద్వేలు పట్టణ అభివృద్ధి కమిటీ, మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధన కమిటీల సభ్యులు సంయుక్తంగా మహాత్మ గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు. కార్యక్రమంలో మహనీయుల ఆశయాల సాధన కమిటీ గౌరవాధ్యక్షులు, కొండపల్లి చిన్న సుబ్బారావు, ఆర్యవైశ్య వర్తక సంఘం మరియు అమ్మవారి శాల పాలకమండలి అధ్యక్షులు కె.వి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొలిశెట్టి నాగరాజు, ఉపాధ్యక్షుడు దర్శి వెంకటేశ్వర్లు, వైభవ్ వెంకట ప్రసాద్, పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నానబాల వెంకటేశ్వర్లు, బద్వేల్ గురుమూర్తి, ఆవాజ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.ఎ సత్తార్,ఎస్. అన్వర్ బాష, పూలే ఆశయ సాధన సమితి ఉపాధ్యక్షులు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :**శాంతి మార్గంతోనే సమస్యలు పరిష్కరించుకోవాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాం గోపాల్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో మహాత్మా గాంధీ విగ్రహానికి ఎమ్మెల్సీ నివాళులు అర్పించారు. పులివెందుల మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాముడు గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. స్వచ్ఛతా హీ సేవలో పాల్గొన్న ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు తిరుపేల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. **వేంపల్లె :** జాతిపిత గాంధీ మహాత్ముడు విశ్వ మానవుడని పిసిసి ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గాంధీ మహాత్ముడు, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని, కామరాజ్ నాడార్ 49వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. వారి చిత్ర పటాలకు తులసిరెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, వేమారాజా, వేమయ్య, నాగరాజు, వినయ్, రవి, వెంకటేష్, మహబూబ్ బాషా, మదార్, ఆరుసెర్ల సుబ్బరాయుడు, బద్రి, రమణ పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్క ప్రజాప్రతినిధి అకుంఠిత దీక్షతో పని చేయాలని సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పేర్కొన్నారు. గాంధీజీ జయంతి సందర్భంగా స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, గాలి హరి, బండల షకూర్, సునీల్, హబీబ్, ఎంపిటిసి కటిక చంద్రశేఖర్, ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ సుబ్రమణ్యం, ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గాంధీజీ కలల కన్న గ్రామ స్వరాజ్యం కోసం ట్రిపుల్‌ఐటి విద్యార్థులు కృషి చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో గాంధీజి జయంతి వేడుకలు నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో టిపుల్‌ఐటి ప్రాంగణంలో ఎమ్మెల్సీ మొక్కలు నాటి నీరు పోశారు. వేంపల్లె టిడిపి కార్యాలయంలో గాంధీజీ, శాస్త్రీ చిత్ర పటాలకు మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్ కైలాస్, విద్యార్థుల సంక్షేమ అధికారి వెంకటేష్, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త దీప్తి, మాజీ ఎంపీటీసీ జీవి రమణ, పోతిరెడ్డి శివ, మైసూరారెడ్డి, ఏమిరెడ్డి కృష్ణారెడ్డి, భానుకిరణ్, విద్యార్థులు పాల్గొన్నారు. వేంపల్లెలోని పలు పాఠశాలలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పాఠశాలల కరస్పాండెంట్లు చక్రపాణిరెడ్డి, నారాయణరెడ్డి, రమణారెడ్డి, కేశవులు, డాక్టర్ ఎస్ఎఫ్ బాషా, నజీర్ బాషా పాల్గొన్నారు. **దువ్వూరు :** సత్యం, అహింస ఆయుధాలుగా భారతదేశపు స్వేచ్ఛా స్వాతంత్ర్య సమరాన్ని ముందుండి నడిపిన జాతిపిత గాంధీజీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ మేనేజర్ శ్యామ్, సిబ్బంది పాల్గొన్నారు. **సింహాద్రిపురం :** శాంతి మార్గంతోనే సమస్యలు పరిష్కారమవుతాయని టిడిపి సీనియర్ నాయకుడు, మాజీ జెడ్పిటిసి సభ్యుడు పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. హిమకుంట్ల గ్రామంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళులర్పించారు. **చాపాడు :** ప్రతి ఒక్కరూ ఆయా గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించి, స్వచ్ఛభారత్ ఆవశ్యకతను ప్రజలకు ప్రచారం చేసినప్పుడే జాతిపిత మహాత్మా గాంధీ కలలుగన్న స్వచ్ఛ భారత దేశాన్ని మనమందరం త్వరలో చూడగలమని కడప నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి మణికంఠ తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం, సిబిఐటి కళాశాల ఆధ్వర్యంలో పల్లవోలులో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ చేశారు. గ్రామ సచివాలయంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సిబి ఐటి కళాశాల డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి, సర్పంచ్ ఎం.జాన్సన్, సిబిఐటి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగార్జున, పంచాయతి సెక్రటరీలు లక్ష్మీ, ప్రసన్న, జ్యోత్స్న, వికసిత ఫౌండేషన్ వ్యవస్థాపకులు లక్ష్మీదేవి, అమ్మ సేవా సమితి శివశంకర్, విజయ్, అశోక్, విద్యార్థులు, నెహ్రూ యువ కేంద్ర యువ వాలంటీర్స్, సిబ్బంది పాల్గొన్నారు. మండల పరిధిలోని అన్ని సచివాలయాలు, ఎంపిడిఒ కార్యాలయం, శాఖ గ్రంథాలయంలో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, గ్రంథాలయ అధికారి శివశంకర్‌రెడ్డి, ఎఒ రామానుజం, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఉపాధి ఏపీఓ జగదీశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు ధనుంజయ, చంద్రశేఖర్, బద్రిపల్లి టిడిపి నాయకులు నారాయణ యాదవ్ పాల్గొన్నారు. **మైదుకూరులో..** మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. మున్సిపాలిటీలో మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి జాతిపిత చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్, చరిత్ర అధ్యాపకులు రామేశ్వర్‌రెడ్డి, అయ్యవారురెడ్డి, సుబ్బరాయుడు, అనురాధ, లక్ష్మి, శశికాంత్‌రెడ్డి, నరసింహారావు, నవనీశ్వర్ రెడ్డి, చెన్నరాయుడు, కేశవ, శ్రీనివాసులు పాల్గొన్నారు. **ఖాజీపేట :** బస్టాండ్ కూడలిలో గాంధీ జయంతి పురస్కరించుకొని ప్రజాసంఘాలు, రాజకీయ నాయకుల ఆధ్వర్యంలో గాంధీకి ఘనంగా నివాళులర్పించారు. గాంధీ సేవలను కొనియాడారు. మాజీ మంత్రి డిఎల్ రవీంద్రారెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. పిహెచ్‌సిలో డాక్టర్ ముబీన్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మాజీ జిల్లా చైర్మన్ గున్నంపాటి వెంకటరమణ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బిజెపి నిరంకుశ పాలన నశించాలని మహాత్మా గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. **ఎర్రగుంట్ల :** గాంధీ జయంతి సందర్భంగా ఆర్‌టిపిపిలో జాతిపిత మహాత్మాగాంధీకి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పవర్ ప్లాంట్ ముఖ్య ఇంజినీర్ గౌరీపతి, పరిపాలన అధికారి సోమశేఖర్, పర్యవేక్షణ అధికారులు అనూప్ రాజు, మీరా, సీనియర్ వెల్ఫేర్ ఆఫీసర్ చార్లెస్, ఫ్యాక్టరీ మేనేజర్ ఎన్.సిద్ధయ్య, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పొన్నా. శివయ్య, హెచ్ 129 రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బిరెడ్డి, 1535 కార్యదర్శి ఎన్.రమణయ్య, ఇంజనీరింగ్ అసోసియేషన్ నాయకులు భాను మాధవరావు. ఎస్‌సి ఎస్‌టి అసోసియేషన్ మునేన్న పాల్గొన్నారు. **ముద్దనూరు :** మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా మండలంలో వేడుకలు ఘనంగా నిర్వ హించారు. స్థానిక ఎంపిడిఒ కార్యా లయంలో ఎంపిడిఒ ముకుందరెడ్డి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొ న్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు నడమల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సునీల్ యాదవ్, గోపాల కృష్ణయ్య, శ్రీనివాసులు, సూర్యమునిరెడ్డి, ప్రతాప్, విజయ్ పాల్గొన్నారు. స్థానిక అప్ గ్రేడ్ పోలీస్ స్టేషన్లో సిఐ దస్తగిరి ఆధ్వర్యంలో ఎస్ఐ మైనుద్దీన్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు పాల్గొ న్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్‌లో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను కరస్పాండెంట్ తరూనేంద్ర శేఖర్, ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. **జమ్మలమడుగు రూరల్ :** జమ్మలమడుగు పట్టణంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు బుధవారం వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్సీ పి.రామ సుబ్బారెడ్డి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, ఉప్పలపాడు శ్రీనివాసులురెడ్డి, ఉప్పలపాటి యోబు లు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాముల బ్రహ్మానందరెడ్డి, పాలాజీ వెంకటస్వామి, మర్రి ప్రకాశం, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాదు, కృష్ణారెడ్డి, దాసు, ముని ఆధ్వర్యంలో నిర్వహించారు. చేనేత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు, కార్యదర్శి వీరణాల శివనారాయణ, డక్క ఓబులేసు, జిల్లా సహాయ కార్యదర్శి మడక వెంకటకృష్ణ, కొండయ్య, సంజీవరాయుడు, ఆధ్వర్యంలో.. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ రీజినల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ రీజనల్ చైర్మన్ రామ్మోహన్, రాష్ట్ర వైస్ చైర్మన్ భాస్కర్ బాబు, నియోజవర్గం మండల అధ్యక్షురాలు అన్నపురెడ్డి రాణెమ్మ, దండు రమేష్, విశ్వనాథ, కిషోర్, దివాకర్, ఎల్ఐసి కార్యాలయంలో మేనేజర్ వెంకటసుబ్బయ్య, సేల్స్ మేనేజర్ కృష్ణారెడ్డి, ఎల్ఐసి సిబ్బంది, ఏజెంట్లు, లియాఫీ నేతలు పాతబస్టాండ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ప్రసంగించారు. **చక్రాయపేట :** సురభి గ్రామం నాగలగట్టుపల్లె జనజాగృతి గ్రంథాలయంలో మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహు దూర్ శాస్త్రి జయంతిని నిర్వహించారు. నేషనల్ కౌన్సి లర్ మెంబర్ కే రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. **బ్రహ్మంగారిమఠం :** మండలంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల బాలుర పాఠశాల, ఎంపి డిఒ, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో జాతిపిత మహా త్మా గాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో రెసి డెన్షియల్ ఉపాధ్యాయులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో ట్రాఫిక్ ఆంక్షలు : డిఎస్‌పి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

దసరా సందర్భంగా ప్రొద్దుటూరు పట్టణంలో డిఎస్‌పి భక్తవత్సలం ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. ఆ మేరకు ఆయన పలు సూచనలు చేశారు. పట్టణంలో వాహనాల రద్దీ నియంత్రణ, భక్తుల సౌకర్యార్థం ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు పటిష్ట చర్యలు ఉంటాయని ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని, జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విలువైన ఆభరణాలు, వస్తువులు ధరించి రాకపోవడం మంచిదన్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు తప్పిపోయే ప్రమాదం ఉందన్నారు. పట్టణంలో గురువారం నుంచి పది రోజులపాటు మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపు ఉంటుందన్నారు. జమ్మలమడుగు వైపు నుండి వచ్చే బస్సులు ప్రొద్దుటూరు టౌన్ లోనికి రాకుండా పొట్టిపాడు క్రాస్ రోడ్డు ద్వారా రాక పోకలు సాగిస్తాయన్నారు. మైదుకూరు వైపు నుండి వచ్చే బస్సులు ఆర్టీసీ బస్టాండ్ దగ్గర నుండి రాకపోకలు సాగిస్తాయన్నారు. రాజుపాలెం వైపు నుండి వచ్చే బస్సులు కొర్రపాడు రోడ్డులో ఉన్న కాల్వకట్ట మల్లెలమ్మ టెంపుల్ వద్ద నుండి రాకపోకలు సాగిస్తాయని, ఎర్రగుంట్ల వైపు నుండి వచ్చే బస్సులు ఎర్రగుంట్ల బైపాస్ జంక్షన్ నుండి సినీ హబ్ ద్వారా కొత్త బస్ స్టాండ్ నుండి రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. జమ్మలమడుగు, రాజుపాలెం వైపు నుండి కార్లు, బైకులలో వచ్చే వ్యక్తులు వారి వాహనాలను ఎగ్జిబిషన్ పార్కింగ్ స్థలంలోను, మార్కెట్ యార్డ్ లోను పార్కింగ్ చేసుకోవాలన్నారు. మైదుకూరు వైపు నుండి కార్లు, బైకులలో వచ్చే వ్యక్తులు వారి వాహనాలను జిన్నా రోడ్డు గుండా వెళ్లి కొవ్వూరు గ్యారేజ్‌లో పార్కింగ్ చేయాలన్నారు. ఎర్రగుంట్ల వైపు నుండి కార్లు, బైకులలో వచ్చే వ్యక్తులు వారి వాహనాలను ఆర్యవైశ్య వృద్ధాశ్రమం వెనుక వైపు ఉన్న పార్కింగ్ స్థలంలో నారాయణ స్కూల్ దగ్గర ఉన్న స్థలంలో పార్కింగ్ చేయాలని సూచించారు. ప్రజలు ఆయా సూచనలు పాటిస్తూ ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలిగించకుండా సహకరించాలని ఆయన కోరారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న నవభారత్ ఫెర్టిలైజర్స్ సిబ్బంది

సేంద్రియ ఎరువులు శ్రేయస్కరం

ప్రజాశక్తి - చాపాడు

పంటసాగులో రసాయన ఎరువులు అధికంగా వినియోగిస్తే ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతాయని, వాటి స్థానంలో సేంద్రియ ఎరువులు వాడడం శ్రేయస్కరమని నవభారత్ ఫెర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణమూర్తి, శ్రీహరి సూచించారు. మండల పరిధిలోని చియ్యపాడు, సీతారామాపురం గ్రామాల్లో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకం వల్ల క్రమంగా భూమిలో సత్తువ క్షీణించి, పంట దిగుబడులు తగ్గిపోతాయన్నారు. తద్వారా మానవ, జంతువుల మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇవి పర్యవరణ కాలుష్యాన్ని పెంచుతాయని వివరించారు. సేంద్రిమి, జీవన ఎరువులు వాడడం వల్ల పెట్టుబడులను తగ్గించ వచ్చన్నారు.అధిక దిగుబడులను పొందవచ్చునని వివరించారు. నవ భారత్ ఫర్టిలైజర్స్ వారు రైతులకు అందించే సేంద్రియ ఎరువులు అధిక పూత, దిగుబడులను అందిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంస్థాయిలో జరిగిన చెకుముకి ప్రతిభ పోటీ పరీక్షలో స్థానిక రెయిన్ బో స్కూల్ విద్యార్థులు నిఖత్, ఫాతిమా, స్వప్న, క్యాడిస్య మొదటి స్థానంలో నిలిచారు. వీరికి మండల విద్యాశాఖాధికారులచే బహుమతులు అందజేశారు. వీరు జిల్లాస్థాయిలో చెకుముకి నిర్వహించనున్న పోటీ పరీక్షకు అర్హత సాధించినట్లు ఆ పాఠశాల కరెస్పాండెంట్ తవ్వా సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం విజేతలను ఘనంగా సత్కరించింది.

'బీరం' విద్యార్థులు ఆదర్శనీయులు

ప్రజాశక్తి - ఖాజీపేట

కొత్త నెల్లూరు సమీపంలోని బీరం శ్రీధర్‌రెడ్డి పాఠశాలలో దశాబ్ద వ్యవస్థాపక దినోత్సవం వేడుకను పాఠశాల యాజమాన్యం బుధవారం ఘనంగా నిర్వహించింది. ముఖ్య అతిధులుగా మున్సిపల్ కమిషనర్ నందన్, డిప్యూటీ కమిషనర్ రాజేష్ హాజయర్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీరం పాఠశాల విద్యార్థులు విద్యలో ఉన్నతంగా రాణిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కరెస్పాండంట్ బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ మంచి విద్యను అందించాలన్న లక్ష్యంతో పాఠశాలను స్థాపించామన్నారు. తమ సంస్థలో విద్యను అభ్యసించిన వారు ఉన్నత స్థానంలో ఉండాలన్నదే తమ ఆశయమన్నారు. కార్యక్రమంలో రాజకీయ ప్రముఖులు, పాఠశాల డైరెక్టర్ స్వాతి శ్రీకాంత్, ప్రిన్సిపల్ శ్వేతా, కళాశాల ప్రిన్సిపల్ హేమ్‌చందర్, కడప బ్రాంచ్ ప్రిన్సిపల్ బషీర్ అహ్మద్, అధ్యాపకులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదేశాలు పాటించని ప్రయివేట్ స్కూల్స్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జిల్లాలో ఉన్న ప్రయివేట్ స్కూల్స్ యాజమాన్యాలు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలను ఏమాత్రం లెక్కచేయడం లేదని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ సంఘ రాయలసీమ కన్వీనర్ గడ్డం రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీ జయంతిని సెలవు దినంగా ప్రకటించినప్పటికీ లోకల్ స్కూల్ యాజమాన్యాలు పదవ తరగతికి క్లాసులు నిర్వహిస్తున్నారన్నారు. ఈనెల 3 నుండి 13వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులను ప్రకటిం చిందన్నారు. గాంధీ జయంతి రోజు జిల్లా వ్యాప్తంగా క్లాసులు నిర్వహించి, చట్ట ఉల్లంఘనకు పాల్పడుతున్న యాజమాన్యాలకు 1982 విద్యాహక్కు చట్టం 84-ఏ ప్రకారం జరిమానా విధించి, స్కూల్ గుర్తింపును రద్దు చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారులు మామూళ్ల మత్తు వదిలి నిబం ధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని గడ్డం రాజు ఆ ప్రకటనలో కోరారు.

కమిషనర్ రాముడుకు మొక్కను అందిస్తున్న ఎస్‌బిఐ సిబ్బంది

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం'

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందామని పురపాలక కమిషనర్ డి.రాముడు పిలుపునిచ్చారు. పులివెందుల బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవ-2024లో భాగంగా సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాముడు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టడం సంతోషదాయకమన్నారు. అనంతరం బ్యాంక్ సిబ్బంది కమిషనర్ రాముడును సన్మానించారు.

వేముల : తుమ్మలపల్లెలో స్వచ్ఛతా హీ సేవా పక్షోత్సవ వేడుకలు-2024ని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా కాలనీ వాసులు, ఎపి స్పెషల్ పోలీస్ ఫోర్స్ ఉద్యోగులు కాలనీ, గెస్ట్‌హౌస్, ఆసుపత్రి, రోడ్లు, మైదానాలను శుభ్రం చేశారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్వచ్ఛతా హీ సేవా-2024 ముగిసిన నేపథ్యంలో కొత్తపల్లి పంచాయతీ సెక్రెటరీ నరసింహులు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులను సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి శాలువా కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. కార్మికులు చేసిన సేవలను కొనియాడారు. వారికి నిత్యావసర సరుకులు అంద జేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది, పలువురు ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గౌరవనీయులైన 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, కడప

O.S.No. 562/2024

Canara Bank, Represented by its Manager, Main Branch-II, Kadapa City & District.

...వాది

Vs

Nandem Ashok Kumar, S/o N.Pullaiah, Hindu, age 35 Years, Business, Business at Room No.20, DCMS Complex, Nagarajupeta, Near Arunchala Hospital, Kadapa City-516001, resident of LIGH 306, APHB Colony, Kadapa City.

...ప్రతివాదులు

ప్రతివాదికి సమన్లు

ఇందుమూలంగా మీకు తెలియజేయడమేమనగా, పై దావా మీ హాజరు కొరకు 21.10.2024వ తేదీన ఉదయం గం. 10.30 ని.లకి పై తెలిపిన కోర్ట్ నందు వాయిదా వున్నది. కావున మీరు స్వయంగా గానీ, మీ తరపున వకీలు ద్వారా గానీ హాజరయ్యి, మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమునందు కేసు తీర్మానించబడును.

//By Order of the Court//

కె.వెంకటసుబ్బయ్య, B.A., B.L.,
వాది తరపు న్యాయవాది,
సెల్: 9704890225.